TELUGU & ENGLISH డిజిటల్ మీడియా | FAST NEWS | VIDEO NEWS | e-PAPER | DIGITAL SERVICES • 24/7

టీ-మీడియా

సామాజికం ... ప్రజల పక్షం ... 24/7 ప్రజా సేవలో...

వార్తలు | వీడియోలు | ఫోటోలు | ఇంటర్వ్యూలు | ప్రజా సమస్యలు | ప్రత్యేక కథనాలు | విశ్లేషణలు

epaper,www.tmedia.net.in | YouTube | facebook

సోమవారం 02/11/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

రాప్తాడు ఘటన

⏭ నిందితుడిపై పోలీసుల కాల్పులు



ఇండియా కూటమి

మెగా మార్చ్

⏭ పోటాపోటీ నిరసనలు.. ⏭ జ్ఞానేశ్ కచ్చితంగా జైలుకే : రాహుల్



టీ మీడియా, నవంబర్ 1, ఢిల్లీ బ్యూరో: ఢిల్లీ లో ఇండియా కూటమి, బీజేపీ మధ్య పోటాపోటీ నిరసనలు హోరెత్తాయి. సీఈసీ రాజీనామా, ఎన్నికల సంస్కరణలకై ఇండియా కూటమి 'ఓట్ బచావో, దేశ్ బచావో' మెగా మార్చ్ నిర్వహించగా, 1984 సిక్కుల ఊచకోతకు వ్యతిరేకంగా బీజేపీ ప్రతి నిరసన చేపట్టింది. ఈ ర్యాలీలను జేపీ నడ్డా తీవ్రంగా విమర్శించారు, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందన్నారు. దేశంలో ఎన్నికల వ్యవస్థను నాశనం చేసినందుకు భవిష్యత్తులో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, దేశద్రోహం కింద జైలుకు పంపుతామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోదీ, అమిత్ షాలు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు. ఢిల్లీలోని రామ్?లీలా మైదాన్?లో జరిగిన ఇండీ కూటమి భారీ ర్యాలీలో ఈ మేరకు ప్రసంగించారు. ఢిల్లీ సభకు వచ్చిన అశేష జనవాహినిని చూస్తుంటే, ప్రధాని, హోంమంత్రి, సీఈసీలకు స్పష్టమైన సందేశం వెళ్లినట్లేనని ఆయన అన్నారు. "మోదీ ఎక్కడికీ వెళ్లరు" అన్న అమిత్ షా వ్యాఖ్యలపై స్పందిస్తూ "మోదీ పారిపోవాలనుకున్నా తాము వదలబోము" అని కౌంటర్ ఇచ్చారు. దేశంలోని యువత, రైతులు, కార్మికులు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ముక్తకంఠంతో చాటుతున్నారని రాహుల్ పేర్కొన్నారు. తన మతం గురించి అడిగితే, దేశ ప్రజల గొంతుకను వినిపించడమే తన మతమని చెప్పారు. ఎంత డబ్బు, పలుకుబడి ఉన్నా రాజ్యాంగం కంటే ఎవరూ గొప్పవారు కాదని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. దేశంలో కొన్నేళ్లుగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు.



దేశంలో ఏ వర్గానికైనా మేలు జరిగిందా?

రైతులు, యువత, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. వారి హక్కులను నిరాకరిస్తున్నారని, దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందని ఆరోపించారు. "పన్నెండేళ్లుగా దేశంలో ఏ వర్గానికైనా మేలు జరిగిందా? యువతకు ఉద్యోగాలు లేవు, రైతులకు ఆదాయం లేదు. (మిగతా 2లో)

పేదల ఓట్లను భారీగా తొలగిస్తున్నారు



⏭ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు..

టీ మీడియా, నవంబర్ 1, హైదరాబాద్ బ్యూరో : ఢిల్లీలో ఇండియా కూటమి మార్చ్‌పై ఉత్కంఠ నెలకొంది.. రామ్‌లీలా మైదానం వేదికగా ఆదివారం సాయంత్రం భారీ బహిరంగ సభ జరగనుంది.. ఈ మేరకు మింటో రోడ్– కన్నాట్ ప్లేస్ జంక్షన్ నుంచి మార్చ్ ప్రారంభమై.. రామ్‌లీలా మైదానం వరకు ర్యాలీ కొనసాగనుంది. ఓట్ బచావో.. దేశ్ బచావో ర్యాలీ నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాతోపాటు 2023 ఎన్నికల కమిషన్ చట్టం రద్దు చేయాలని..

సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని.. తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చి.. బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలను నిర్వహించాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది.

ఓట్ బచావో.. దేశ్ బచావో ర్యాలీ కోసం కాంగ్రెస్ లీడర్లు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. తెలంగాణ నుంచే 7వేల మందికిపై కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీ చేరారు. 77 బస్సులు, 600 కార్లలో ఢిల్లీలో తెలంగాణ భవన్‌కి లీడర్లు చేరుకున్నారు. తెలంగాణ భవన్‌కి చేరుకున్న కార్యకర్తలనుద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. అక్కడి (మిగతా 2లో)

ప్రకటనల విభాగంలో వసూల్ రాజాలు

⏭ బోర్డుల లైసెన్సుల పేరుతో అక్రమ వసూళ్ల దందా!

టీ మీడియా, నవంబర్ 1 , హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ప్రకటనల విభాగంలో కొందరు సిబ్బంది వ్యవహారశైలి తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. ప్రకటనల బోర్డులకు లైసెన్సులు జారీ చేయడం, ఫీజులు వసూలు చేయడం వంటి అధికారాలు లేకపోయినా కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'తనిఖీలు చేసేది మేమే.. అధికారులు కూడా మేము చెప్పిందే వింటారు. మామూళ్లు చెల్లిస్తే మీ వ్యాపారం జోలికి ఎవరూ రారు' అంటూ వ్యాపారులను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం.జీహెచ్ఎంసీ కార్యాలయంలో



అధికారులకు (మిగతా 2లో)

సర్వే సమయంలో ఊరెళ్లిన వారి ఓట్ల రద్దు


సంతకం లేదంటూ లక్షల అర్జీలపై వేటు

టీ మీడియా, నవంబర్ 1, హైదరాబాద్ బ్యూరో : ఎస్ఐఆర్‌లో భాగంగా డిక్లరేషన్ పత్రంపై సంతకం లేదంటూ హైదరాబాద్?లోని 1.65లక్షల ఓటర్ల దరఖాస్తులపై అధికారులు వేటువేశారు. సర్వే సమయంలో ఊరెళ్లిన వారి ఓట్లను ముసాయిదా జాబితాలో తొలగించారు.తల్లి మరణించడంతో ఊరికెళ్లిన ఓ కుటుంబంలో 10 ఓట్లు రద్దయ్యాయి. (మిగతా 3లో)



ఏపీకి మరో తుఫాను ముప్పు..

సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన రద్దు..



టీ మీడియా, నవంబర్ 1, అమరావతి బ్యూరో: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి తీవ్ర తుఫానుగా మారనుండటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుఫాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుఅమరావతిలోఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. (మిగతా 3లో)



ఇండియా కూటమి మెగా మార్చ్

(మొదటి పేజీ తరువాయి)

అదానీకి ఆమ్దానీ వస్తే చాలన్నట్లుగా మోదీ పాలన ఉంది. టెలికాం, పోర్టులు, బ్యాంకులు అన్నింటినీ అదానీ చేతిలో పెట్టారు. మోదీ, అమిత్ షా కలిసి దేశాన్ని అదానీకి అమ్ముతున్నారు. కేవలం ఇద్దరు ముగ్గురు వృద్ధి చెంది, మొత్తం వ్యవస్థను తమ ఆధీనంలోకి ఉంచుకునే దేశం మనకొద్దు." అని రాహుల్ గాంధీ అన్నారు.

హిందుస్థాన్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది: రాహుల్‌గాంధీ

ఈవీఎంలు ద్వారా, ఓటర్ల జాబితాలో మార్పుల ద్వారా ఓట్లను తారుమారు చేశారని రాహుల్ పేర్కొంటూ, అనేక అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల దొంగతనం జరిగిందని ఆరోపించారు. "హిందుస్థాన్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. కొన్నేళ్లుగా దేశంలో ఓటుచోరీ జరుగుతోంది. ఓటుచోరీ, ఈవీఎంల చోరీతోనే బీజేపీ విజయం సాధించింది. బంగాల్, మధ్యప్రదేశ్, హరియాణాలో ఓటుచోరీతోనే బీజేపీ గెలిచింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో ఓటు చోరీ చేసి గెలిచారు. సర్ పేరిట దేశంలో ఏకంగా 13.5 కోట్ల ఓట్లు తొలగించారు. 2024 ఎన్నికల ముందు ఏకంగా 15 శాతం మంది ఓట్లు తొలగించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ–యూపీఏ మధ్య ఓట్ల అంతరం 3 శాతం మాత్రమే. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ చేసిన నేరం చిన్నది కాదు. దేశ ప్రజలకు ఓటు హక్కు లేకుండా చేశారు. ఓటు ద్వారా ప్రజలు తమ అభిప్రాయం చెప్పే అవకాశం లేకుండా చేశారు." అని రాహుల్ గాంధీ అన్నారు.

పేదల ఓట్లను భారీగా తొలగిస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ర్యాలీగా రామ్ లీలా మైదాన్‌కి కాంగ్రెస్ నేతల ర్యాలీ కొనసాగనుంది.

ఓట్ చోరీపై పోరాటం

ఓట్ చోరీతో బీజేపీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కుట్రలు చేస్తోందని.. సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీ గద్దె దిగేంత వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందన్నారు. పేదల ఓట్లను పెద్ద ఎత్తున తొలగిస్తున్నారని.. ఓట్ చోరీపై రాహుల్ గాంధీ నేతృత్వంలో పోరాటం కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

ప్రకటనల విభాగంలో వసూల్ రాజాలు

(మొదటి పేజీ తరువాయి)

సహాయకులుగా పనిచేయాల్సిన సుమారు 10 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఓ సహాయ ఇంజినీరు అండదండలతో తమ పరిధిని విస్తరించుకుని వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోజువారీ వసూళ్లే లక్ష్యంగా వ్యవహరిస్తూ, ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులను సంప్రదించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు, సిబ్బంది కుమ్మక్కై నెలకు కనీసం కోటి రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ప్యాట్నీ జంక్షన్‌లో రూ.10 లక్షల వసూళ్ల వ్యవహారం!

సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ జంక్షన్ వద్ద ఓ ప్రముఖ టెక్స్‌టైల్ వ్యాపార సంస్థకు చెందిన షాపింగ్ మాల్ యాజమాన్యం నుంచి నెల రోజుల క్రితం రూ.10 లక్షలు వసూలు చేసినట్లు వస్తున్న ఆరోపణలు ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యం కల్పిస్తున్నాయి. ప్రకటనల బోర్డుల లైసెన్సుల పేరుతో ఇంత భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేయడం వెనుక ఎవరున్నారు? ఈ వ్యవహారంలో అధికారుల పాత్ర ఏమిటి? వసూలు చేసిన మొత్తాలు ఎక్కడికి వెళుతున్నాయి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి!

ఒకప్పుడు జీహెచ్ఎంసీకి ప్రకటనల ద్వారా ఏటా సుమారు రూ.100 కోట్ల ఆదాయం సమకూరేదని సమాచారం. ప్రస్తుతం ఆ ఆదాయం కేవలం రూ.30 కోట్లకు పడిపోయినట్లు తెలుస్తోంది. అంటే గతంతో పోలిస్తే ప్రభుత్వ ఆదాయంలో భారీ తగ్గుదల నమోదైంది. నగరవ్యాప్తంగా అనుమతులు లేని ప్రకటనల బోర్డులు పెరిగిపోవడం, నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనలు ఏర్పాటు చేయడం, వాటిపై సమర్థవంతమైన పర్యవేక్షణ లేకపోవడం వంటి అంశాలు ఆదాయ తగ్గుదలకు కారణాలుగా కనిపిస్తున్నాయి.రాజకీయ నాయకులు, కొందరు అధికారులు అనుమతులు లేని ప్రకటనలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అక్రమ ప్రకటనలపై చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వ ఖజానాకు ఆదాయం ఎలా సమకూరుతుందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

సిబ్బంది కొరతా.. లేక వసూళ్లకు అవకాశం కల్పించడమా?

ప్రకటనల విభాగంలో గతంలో అదనపు కమిషనర్, జాయింట్ కమిషనర్, ప్రతి జోన్‌కు అసిస్టెంట్ ఇంజినీరు, ఇన్‌స్పెక్టర్లు, ప్రకటనల అధికారులు, సహాయ ప్రకటనల అధికారులు తదితరులతో కూడిన వ్యవస్థ ఉండేదని సమాచారం. ప్రస్తుతం మాత్రం ఒక అసిస్టెంట్ ఇంజినీరు, సుమారు 15 మంది పొరుగు సేవల సిబ్బందితోనే విభాగం కార్యకలాపాలు సాగుతున్నట్లు తెలుస్తోంది.

ఇంత పెద్ద నగరంలో ప్రకటనల నియంత్రణ, లైసెన్సుల పరిశీలన, ఫీజుల వసూళ్లు, అక్రమ బోర్డుల తొలగింపు వంటి కీలక బాధ్యతలు నిర్వహించాల్సిన విభాగంలో పూర్తిస్థాయి అధికార యంత్రాంగం లేకపోవడం పర్యవేక్షణ లోపాలకు దారితీస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లైసెన్సుల పేరుతో కొత్త దందా!

ప్రకటనల ఫీజులు, లైసెన్సు రుసుములను వసూలు చేయాల్సిన బాధ్యత సంబంధిత సర్కిళ్ల ఉపకమిషనర్లు, సహాయ ఉపకమిషనర్ల పరిధిలో ఉంటుంది. అయితే ఈ ప్రక్రియలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వ్యాపారుల నుంచి నేరుగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఎల్ఈడీ నేమ్ బోర్డు (గ్లోసైన్ బోర్డు)కు సంబంధించి నిబంధనల ప్రకారం 20 అడుగుల పొడవు, వెడల్పుతో కూడిన బోర్డుకు చదరపు మీటరుకు రూ.1,850 చొప్పున వార్షిక లైసెన్సు ఫీజు రూ.68,820 చెల్లించాల్సి ఉంటుందని సమాచారం.అయితే ఇదే తరహా బోర్డులకు 5 అడుగుల కొలతలతో లెక్క చూపిస్తూ కేవలం రూ.4,301 రుసుముతో లైసెన్సు ఇప్పిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఒక్కో బోర్డుకు సుమారు రూ.20 వేల వరకు కమీషన్ తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన అసలు ఆదాయం తగ్గిపోవడమే కాకుండా, నిబంధనలను పాటించే వ్యాపారులకు అన్యాయం జరుగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెద్ద సంస్థలే లక్ష్యంగా వసూళ్లు?

నగరవ్యాప్తంగా అనేక బ్రాంచీలు కలిగిన వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకుని గంపగుత్తగా ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా సంస్థల నుంచి సంవత్సరానికి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ముడుపులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా చెల్లింపులు చేస్తే తనిఖీల పేరుతో ఇబ్బందులు ఉండవని, అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోరని వ్యాపారులకు భరోసా ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాప్తాడు ఘటన

● నిందితుడిపై పోలీసుల కాల్పులు

టీమీడియా , నవంబర్ 1, అనంతపురం:

జిల్లా రాప్తాడ బాలికపై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిందితుడు హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. ఆత్మకూరు అటవీప్రాంతంలో నిందితుడు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆరురౌండ్లు కాల్పులు జరిపినట్టు పోలీసులు తెలిపారు. కాల్పుల్లో నిందితుడికి తీవ్ర గాయాలయ్యాయి.రాప్తాడులోని పాఠశాలలో తరగతి గదిలోకి చొరబడిన హేమంత్, అత్యంత అమానుష ఘాతుకానికి ఒడిగట్టాడు. పదోతరగతి చదువుతున్న బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో విచక్షణారహితంగా దాడి చేసి ఆమెను ప్రాణాపాయ స్థితిలోకి నెట్టాడు. రాప్తాడు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గోపిక రాప్తాడు జడ్పీ పాఠశాలలో చదువుతోంది. ఉదయం తరగతి గదిలో ఉండగా, వరుసకు బాబాయ్ అయ్యే హేమంత్ ఒక్కసారిగా ఎలక్ట్రిక్ రంపంతో లోపలికి ప్రవేశించి పాశవికంగా దాడికి పాల్పడ్డాడు. దీంతో 15 ఏళ్ల బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో లోతైన గాయాలయ్యాయి. తరగతిలో జరుగుతున్న ఈ దారుణాన్ని చూసి అంతా భయాందోళనకు గురయ్యారు. లక్ష్మి అనే విద్యార్థిని మాత్రం ధైర్యంగా ఉన్మాదిని అడ్డుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఆమె రెండు కాళ్లకూ తీవ్ర గాయాలయ్యాయి. అంతా కేకలు వేయడంతో నిందితుడు రంపాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. రక్తపుమడుగులో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న గోపిక, గాయపడిన లక్ష్మిని స్థానికులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతోంది.

ముగిసిన మున్సిపల్ పోలింగ్

● 3న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

టీ మీడియా, నవంబర్ 1, అమరావతి:



ఏపీలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ముగిసింది. పోలింగ్ ముగిసే సమయానికి సాయంత్రం ఐదు గంటల వరకు క్యూలైన్‌లో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 92 పట్టణ స్థానిక సంస్థలకు ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా పలు చోట్ల చెదురుమదురు చెదురుమదురు ఘటనలు మినహా అన్ని చోట్లా ఎన్నికలు సజావుగా సాగాయి. కొన్నిచోట్ల బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 55వ డివిజన్‌లో ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని పొడిగించింది. బ్యాలెట్ పేపర్‌పై గుర్తులు తారుమారు కావడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో ఓటు వేసేందుకు రెండున్నర గంటల అదనపు సమయం ఇచ్చారు.మరోవైపు అన్ని జిల్లాల్లో పోలింగ్ జరిగిన తీరుపై సమీక్ష నిర్వహించామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించామని చెప్పారు. జిల్లాల పరిశీలకులతో ఎప్పటికప్పుడు మాట్లాడామన్నారు. పోలింగ్ సరళిపై 12 జిల్లాల కలెక్టర్లతో మాట్లాడామని పేర్కొన్నారు. 12 జిల్లాల్లో ఎక్కువగా రాయలసీమ జిల్లాలు ఉన్నాయని వివరించారు. కొన్ని జిల్లాల్లో చిన్న చిన్న ఫిర్యాదులు వచ్చాయని, కొన్ని జిల్లాల నుంచి అసలు ఫిర్యాదులే రాలేదని వెల్లడించారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు..

● మున్సిపల్ ఎన్నికల తీరుపై జగన్

టీ మీడియా, నవంబర్ 1, కడప:



రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ తీరుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా ఎన్నికలు నిర్వహించారని విమర్శించారు. కడపలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో చోటుచేసుకున్న పరిణామాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.70 మంది బూత్ ఏజెంట్లు పోలింగ్ బూత్‌లకు వెళ్లలేని పరిస్థితి ఉంటే ఎన్నికలు సజావుగా జరిగినట్లు ఎలా భావిస్తారని ప్రశ్నించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలకు పాల్పడితే ఎన్నికలు ఎలా జరుగుతాయని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం బతికే ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (రాజుజు) లాఫింగ్ స్టాక్‌గా మార్చేశారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో జరిగిన అక్రమాలు, దౌర్జన్యాల నేపథ్యంలో రీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేసినట్లు జగన్ తెలిపారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం, ఎస్పీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. జరిగిన ప్రతి ఘటనపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.ప్రజల ఓట్లనే లాక్కున్నవారు రేపు ప్రజల ఆస్తులను కూడా లాక్కుంటారని వ్యాఖ్యానించారు. తప్పులు చేసిన వారందరికీ శిక్షలు తప్పవని హెచ్చరించారు. తాము తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఘటనలపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి సమగ్ర విచారణకు ఆదేశిస్తామని జగన్ వెల్లడించారు.

మెడల్ అందుకున్నాడు

● నిమిషాల్లోనే గుండెపోటుతో మృతి!

టీ మీడియా, నవంబర్ 1, హైదరాబాద్:



ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో మారథాన్‌లో పాల్గొన్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు అనూహ్య విషాదం ఎదురైంది. ఎంతో ఉత్సాహంగా పరుగును పూర్తి చేసి మెడల్ అందుకున్న కొద్దిసేపటికే గుండెపోటుతో కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. మారథాన్ ముగిసిన తర్వాత అల్పాహారం కోసం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం (నవంబర్ 01) ఉదయం జరిగిన ఈ విషాద ఘటన తోటి రన్నర్లను, నిర్వాహకులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం ఉదయం మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మణికొండలోని అల్కాపూర్ కాలనీకి చెందిన కొమ్మినేని గోపి (36) పాల్గొన్నారు. మారథాన్‌లో ఉత్సాహంగా పరుగెత్తిన ఆయన.. నిర్దేశిత రన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం మెడల్ కూడా అందుకున్నారు. రన్ పూర్తి చేసిన ఆనందంలో ఉన్న గోపి.. కొద్దిసేపటికే తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.మారథాన్ ముగిసిన తర్వాత అల్పాహారం కోసం వెళ్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. ఈ పరిణామంతో అక్కడున్నవారు ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్పందించిన మారథాన్ నిర్వాహకులు గోపిని చికిత్స నిమిత్తం సమీపంలోని కేర్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతుడు కొమ్మినేని గోపి ప్రముఖ ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధతో మారథాన్‌లో పాల్గొన్న ఆయన.. పరుగును పూర్తి చేసి పతకం అందుకున్న కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోవడం విషాదాన్ని నింపింది. ఈ ఘటనతో మారథాన్ ప్రాంగణంలో విషాదఛాయలు అలుముకున్నాయి.మారథాన్‌లో పాల్గొని విజయవంతంగా పరుగును పూర్తి చేసిన వ్యక్తి ఇలా అకస్మాత్తుగా మృతి చెందడంతో తోటి రన్నర్లు షాక్‌కు గురయ్యారు. గోపి మరణవార్త తెలిసి కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఉత్సాహంగా ప్రారంభమైన మారథాన్ కార్యక్రమంలో చోటుచేసుకున్న ఈ ఘటన అందరినీ కలచివేసింది.

డివైడర్‌ను ఢీకొట్టి ఆపోజిట్ రోడ్డులో బోల్తాపడిన కారు..





⏭ స్పాట్‌లోనే యువకుడు మృతి

టీ మీడియా, నవంబర్ 1, రంగారెడ్డి :

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పామెన గేటు సమీపంలో అతివేగంతో ప్రయాణిస్తున్న ఒక కారు అదుపుతప్పి తీవ్ర ప్రమాదానికి గురైంది. వేగంగా వెళ్తున్న వాహనం ఒక్కసారిగా అదుపు తప్పి, రోడ్డు మధ్యలోని డివైడర్‌ను దాటుకుని అవతలి వైపు ఉన్న రహదారిపైకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొక ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

ఈ దుర్ఘటనలో బాధితులంతా షాబాద్ మండలం పొత్గల్ గ్రామానికి చెందినవారుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాద సమయంలో కారులో మొత్తం నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలై రాజ్‌కుమార్ గౌడ్ అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన మరణంతో పొత్గల్ గ్రామంలో తీవ్ర శోకసంద్రం అలుముకుంది. కారులో ఉన్న మిగిలిన ప్రయాణికులు మురళి గౌడ్, ఒగ్గు వెంకటయ్య, కార్ల శివకుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

కాగా, ఈ పామెన గేటు బ్రిడ్జి సమీప ప్రాంతం ప్రమాదాల జోన్‌గా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురికావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా సరిగ్గా ఇదే ప్రదేశంలో అతివేగం కారణంగా కారు బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వరస ప్రమాదాలతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి గల పూర్తి వివరాలపై దర్యాప్తు జరుపుతున్నారు

మండలంలో మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ పర్యటన



⏭ కోటమైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

⏭ నూతన దంపతులకు ఆశీర్వాదం

టీ మీడియా,నవంబర్01,సింగరేణి(కారేపల్లి):

వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ ఆదివారం సింగరేణి మండలంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ముందుగా ఉసిరికాయలపల్లిలోని శ్రీ కోటమైసమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకున్నారు.ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు ఆయనకు స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు.అనంతరం రాములు నాయక్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు కైలాస శర్మ కుమారుడు శంకర్ శర్మ--శరణ్య నూతన దంపతులను రాములు నాయక్ ఆశీర్వదించారు.వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని, ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అనంతరం మండల కేంద్రంలో ఉపాధ్యాయుడు కేలోత్ నరేష్ నూతనంగా నిర్మించిన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గృహప్రవేశానికి హాజరైన ఉపాధ్యాయులు,వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో రాములు నాయక్ ముచ్చటించారు.అనంతరం లావుడియా వాగ్య నాయక్ నివాసంలో తేనీటి విందును స్వీకరించారు.ఈ కార్యక్రమాల్లో నాయకులు అజ్మీర వీరన్న,జాల సాంబ,దారావత్ రాంజీ,భూక్య రాంకిషోర్,గుగులోత్ సురేష్,జర్పుల చందర్,ఉపాధ్యాయ సంఘాల నాయకులు భూక్య శ్యామ్‌లాల్,మాలోత్ ప్రతాప్ సింగ్,గుగులోత్ రవీందర్ నాయక్,అజ్మీర వీరు నాయక్,రాజు నాయక్,బానోత్ మంగీలాల్ నాయక్,కేలోత్ రాములు నాయక్,టీడీపీ నాయకులు వాంకుడోత్ మత్రు,వాంకుడోత్ లక్ష్మణ్,అంగోత్ శంకర్,వార్డు సభ్యుడు భూక్య కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు ముఠాలపై దమ్మపేట పోలీసుల కొరడా



⏭ గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు..

టీ మీడియా, నవంబర్,1 దమ్మపేట:

యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటంతో పాటు, గంజాయి అక్రమ వినియోగం, నిల్వలకు అడ్డుకట్ట వేసేందుకు దమ్మపేట పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని ఆర్లపెంట గ్రామ శివారులో నిర్వహించిన తనిఖీల్లో గంజాయి సేవిస్తున్న ఆరుగురిని గుర్తించడంతో పాటు, మరో ఇద్దరి వద్ద పావు కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఎనిమిది మందిపై చట్టపరమైన చర్యలు చేపట్టడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.పోలీసులు మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అక్టోబర్ 31న దమ్మపేట ఎస్సై బి. రాజేష్ కుమార్ తన సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్లపెంట గ్రామ శివారులోని శ్మశానవాటిక వద్ద కొందరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

ఆరుగురికి పాజిటివ్

అదుపులోకి తీసుకున్న ఆరుగురికి పోలీసులు యూరిన్ డ్రగ్ పరీక్షలు నిర్వహించగా, అందులో టిహెచ్‌సీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అనంతరం చేపట్టిన విచారణలో గంజాయి కలిగి ఉన్న మరో ఇద్దరి వివరాలు వెలుగులోకి వచ్చాయి. లంకాలపల్లికి చెందిన పొట్ట సాయికుమార్ అలియాస్ సాయి, నాగుపల్లికి చెందిన లవుడియా చైతన్య వద్ద గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

పావు కిలో గంజాయిస్వాధీనం

వారివద్ద నుంచి సుమారు పావు కిలో గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.12,500 ఉంటుందని వెల్లడించారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరికి సరఫరా చేస్తున్నారు? దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

ఆరుగురిని డీ-అడిక్షన్ కేంద్రానికి..

ఈ కేసులో గంజాయి సేవించిన ఆరుగురితో పాటు, గంజాయి కలిగి ఉన్న మరో ఇద్దరిని దమ్మపేట కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు గంజాయి సేవించిన ఆరుగురిని డీ-అడిక్షన్ కేంద్రానికి తరలించగా, గంజాయి కలిగి ఉన్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాలకు సంబంధించిన ఇతర వ్యక్తుల ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తనిఖీల్లో అశ్వారావుపేట సీఐ నాగరాజు, దమ్మపేట ఎస్సై బి. రాజేష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే సమయంలో ఊరెళ్లిన వారి ఓట్ల రద్దు

(మొదటి పేజీ తరువాయి)

వివాహ వేడుక కోసం బంధువుల గ్రామానికెళ్లిన మరో కుటుంబంలోని అందరి పేర్లను ఓటర్ల జాబితా నుంచి పూర్తిగా తొలగించారు. హైదరాబాద్?లో ఎస్?ఐఆర్? ప్రక్రియలో భాగంగా నిర్ణీత గడువులోపు ఎన్యూమరేషన్ పత్రాలను సమర్పించలేక ఇలా ఓటు హక్కు కోల్పోయిన బాధితులు కోకొల్లలుగా దర్శనమిస్తున్నారు.

ఈ లోపాలను సరిదిద్దడం కోసం అధికారులు తిరిగి ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రయత్నిస్తున్నా, డిక్లరేషన్ ఫారానికి సంబంధించిన సమస్యల కారణంగా ఆ ప్రయత్నాలూ ఫలించడం లేదు. 'నేను మొదటిసారి ఓటరుగా నమోదు చేసుకుంటున్నాను' అని డిక్లరేషన్? ఫారంపై సంతకం పెడితే, చట్టప్రకారం తప్పుచేసినట్లే అవుతుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేలాది ఓటు నమోదు దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి.

మేం తప్పుడు ధ్రువీకరణ ఎందుకివ్వాలి?

ఓటరు నమోదు కోసం ఫారం-6లో దరఖాస్తుదారులు తమ వివరాలు నింపి, ఫొటోను జత చేసి, చివరలో సంతకం చేయాల్సి ఉంటుంది. ఈ ఫారంతో పాటు మరో పత్రంపైనా సంతకం చేయాల్సి ఉంటుంది. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల ఓట్ల వివరాలు నమోదు చేయాలి. లేదంటే ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి జత చేయాలి. వీటితో పాటు "నేను తొలిసారి ఓటరుగా నమోదు చేసుకుంటున్నాను" అని పేర్కొంటూ చివర్లో డిక్లరేషన్? ఫారంపై సంతకం పెట్టాలి.

ఎన్యూమరేషన్? పత్రాలు తిరిగివ్వకపోవడం, తల్లిదండ్రులు లేదా పూర్వీకుల ఓట్లతో మ్యాపింగ్ చేసుకోకపోవడం లేదా బీఎల్వోల నిర్లక్ష్యం వంటి కారణాలతో ఓటు హక్కు కోల్పోయిన బాధితులు డిక్లరేషన్ ఫారంపై సంతకం చేయడానికి అభ్యంతరం తెలుపుతున్నారు. తమ ఓట్లు రద్దు చేస్తే, తిరిగి నమోదు చేసుకోవడానికి తామెందుకు తప్పుడు ధ్రువీకరణ ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. ఎస్?ఐఆర్?కు ?ముందు హైదరాబాద్? మహానగర ఓటరు జాబితాలో 1,14,15,542 ఓటర్లుండగా, ముసాయిదా జాబితాలో ఆ సంఖ్య 71,15,441గా నమోదైంది.

నేపాల్‌లో భారీ హిమపాతం



⏭ భారతీయులు మిస్సింగ్

టీమీడియా , నవంబర్ 1, ఢిల్లీ బ్యూరో

నేపాల్?లోని హిమాలయ పర్వత ప్రాంతంలో ఆరుగురు భారతీయ పర్యటకులు గల్లంతయ్యారు. దేశంలోనే అత్యంత లోతైన సరస్సుగా పేరొందిన షే- ఫోక్సుండోకు ట్రెక్కింగ్?కు వెళ్లిన ఆరుగురు, భారీగా మంచు కురవడంతో పర్వత మార్గాల్లో చిక్కుకుపోయి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. గల్లంతైన వారిలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. వారి ఆచూకీ కోసం నేపాల్ సైన్యం సహా స్థానిక యంత్రాంగం గాలింపు చర్యలు చేపట్టింది.అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, డోల్పో బుద్ధ గ్రామీణ మున్సిపాలిటీలోని 4, 8వ వార్డుల నుంచి షే-ఫోక్సుండో సరస్సు వైపు ప్రయాణించిన సమయంలో భారతీయ పర్యటకులు గల్లంతైనట్లు సమాచారం. షే-ఫోక్సుండో గ్రామీణ మున్సిపాలిటీ పరిధిలోని నుమ్లా పాస్, బగ్లా పాస్ ప్రాంతాల్లో వారు చివరిసారిగా కనిపించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ధో ప్రాంతం నుంచి ఫోక్సుండో సరస్సు వైపు తిరిగి వస్తుండగా వారు మంచులో చిక్కుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో భారీగా హిమపాతం నమోదవుతుండటంతో పర్యటకుల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వాతావరణం అనుకూలంగా లేదని, పర్వత కనుమలను దాటడం కష్టమని స్థానికులు ముందుగానే హెచ్చరించినప్పటికీ వారు ప్రయాణాన్ని కొనసాగించినట్లు అధికారులు తెలిపారు.

ఫోన్ సిగ్నల్స్ లేక ఆచూకీ కష్టం

పర్యటకుల ఆచూకీ తెలుసుకోవడంలో మొబైల్ ఫోన్ కనెక్టివిటీ లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. 4, 8వ వార్డుల మధ్య ఉన్న పర్వత కనుమల్లో ఫోన్ సిగ్నళ్లు అందుబాటులో ఉండవని షే-ఫోక్సుండో గ్రామీణ మున్సిపాలిటీ ఛైర్మన్ ధావా సాందుక్ గురుంగ్ తెలిపారు. దీంతో గల్లంతైన వారి ప్రస్తుత పరిస్థితి, వారు ఎక్కడ ఉన్నారనే వివరాలు సేకరించడం కష్టంగా మారిందన్నారు. ఈ ఘటనపై డోల్పా జిల్లా ముఖ్య అధికారి జును హమాల్ స్పందించారు. ధో నుంచి ఫోక్సుండో సరస్సు వైపు తిరిగి వస్తున్న క్రమంలో పర్యటకులు ప్రతికూల పరిస్థితుల్లో చిక్కుకున్నట్లు తెలిపారు. వాతావరణం, పర్వత మార్గాల పరిస్థితులపై స్థానికులు హెచ్చరించినా వారు ముందుకు వెళ్లారని వివరించారు.

రంగంలోనికి నేపాల్ సైన్యం

మరోవైపు భారీగా పేరుకుపోయిన మంచు, ప్రతికూల వాతావరణం సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తున్నాయి. ఆ ప్రాంతంలో మొబైల్ కనెక్టివిటీ లేకపోవడం, దట్టమైన మంచు కారణంగా వారి ఆచూకీ గుర్తించడం మారింత కష్టంగా మారిందని అధికారులు తెలిపారు. గల్లంతైన వారిని గుర్తించేందుకు నేపాల్ సైన్యం బృందాన్ని కూడా రంగంలోకి దించారు. అవసరమైన గాలింపు, రక్షణ చర్యల కోసం హెలికాప్టర్ ఏర్పాటు చేయాలని సంబంధిత విభాగాలను అధికారులు కోరినట్లు డోల్పా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్? పోలీస్ అనిల్ రాజ్? గిరి తెలిపారు.

ఏపీకి మరో తుఫాను ముప్పు..

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో రానున్న రోజుల్లో కురవబోయే వర్షాలు, ఈదురుగాలుల తీవ్రత, జలాశయాల నీటిమట్టాలు, తీసుకోవాల్సిన ముందస్తు రక్షణ చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. విపత్తు తీవ్రత దృష్ట్యా సీఎం తన రేపటి ఢిల్లీ పర్యటనను సైతం రద్దు చేసుకుని క్షేత్రస్థాయి పరిస్థితుల పర్యవేక్షణపై దృష్టి సారించారు.

బాపట్ల సమీపంలో తీరం దాటే ముప్పు

వాతావరణ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం.. ప్రస్తుత వాయుగుండం క్రమంగా బలపడి తీవ్ర వాయుగుండంగా, అనంతరం తుఫానుగా రూపాంతరం చెందనుంది. నవంబరు 2 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఇది తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉంది. నవంబరు 3న ఉదయం బాపట్ల సమీపంలో తీవ్ర తుఫానుగా తీరం దాటే సూచనలు కనిపిస్తున్నాయి. తీరం దాటే సమయంలో గంటకు 100 నుండి 110 కిలోమీటర్ల వేగంతో భీకర ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉంది.

విస్తారంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు

నవంబరు 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాల తీవ్రత పెరగనుంది. ముఖ్యంగా దక్షిణ, మధ్య కోస్తా జిల్లాల్లో విస్తారంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు, అక్కడక్కడా అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. నవంబరు 3, 4 తేదీల్లో పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు నమోదవుతాయని అధికారులు వెల్లడించారు.

అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రాంతాలు:

అత్యంత భారీ వర్ష సూచన ఉన్న 20 మండలాల్లో ఏలూరు జిల్లాలో 9, కృష్ణాలో 5, ఎన్టీఆర్‌లో 5, బాపట్లలో ఒక మండలం ఉన్నాయి.

నవంబరు 3న అంచనా సగటు వర్షపాతం

ఏలూరు: సుమారు 179 మి.మీ.కృష్ణా: 163 మి.మీ.ఎన్టీఆర్: 161 మి.మీ.పశ్చిమ గోదావరి: 147 మి.మీ.గుంటూరు: 119 మి.మీ.బాపట్ల: 104 మి.మీ.జలాశయాలకు వరద ముప్పు -- విద్యుత్ రంగానికి నష్టం

అంచనాభారీ వర్షాల కారణంగా నవంబరు 3న విజయవాడ సమీపంలోని బుడమేరుకు సుమారు 32,500 క్యూసెక్కుల మేర భారీ ప్రవాహం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. దీంతో పాటు ఎర్రకాల్వ, గోనెలవాగు, జల్లేరు, పంపా తదితర జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరే ప్రమాదం ఉన్నందున రిజర్వాయర్ల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని సీఎం ఆదేశించారు. భారీ ఈదురుగాలుల ప్రభావంతో 12 జిల్లాల్లో దాదాపు 12,102 నుండి 15,128 విద్యుత్ స్తంభాలు దెబ్బతినే అవకాశం ఉందని విద్యుత్ శాఖ ప్రాథమిక అంచనాలు వేసింది. అత్యవసర పునరుద్ధరణ పనులకు అవసరమైన సామగ్రి, అదనపు సిబ్బందిని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సీఎం ఆదేశించారు.

ఫర్నిచర్ షాపులోకి దూసుకెళ్లిన కారు



టీ మీడియా, నవంబర్ 1 , సంగారెడ్డి :
సదాశివపేటలో స్కార్పియో వాహనం బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన కారు మొదట డివైడర్‌ను ఢీకొట్టి, అనంతరం రోడ్డుపై వెళ్తున్న రెండు బైకులను ఢీకొట్టింది. అక్కడితో ఆగకుండా వేగంగా దూసుకెళ్లి ఓ ఫర్నిచర్ షాపులోకి చొచ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాద ధాటికి రెండు బైకులు పూర్తిగా దెబ్బతినగా, ఫర్నిచర్ షాపులోని వస్తువులు ధ్వంసమయ్యాయి. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదానికి సంబంధించిన భయానక దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రస్తుతం ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఫైనాన్స్ ట్రాక్టర్లే వారి టార్గెట్



⏭ లీజు పేరుతో రైతులకు టోకరా

టీ మీడియా, నవంబర్ 1 , ఆదిలాబాద్:
ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రైతులే ఆ ముఠాకు టార్గెట్.. ఫైనాన్స్ వాయిదాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న రైతులను గుర్తించి రంగంలోకి దిగుతున్నారు. ఫైనాన్స్ బకాయిలు తామే చెల్లిస్తామంటూ నమ్మిస్తున్నారు. లీజు ప్రాతిపదికన ట్రాక్టర్లు తీసుకుంటూ రైతులకు ఆశ చూపిస్తున్నారు. తీరా ట్రాక్టర్లు చేతికి చిక్కగానే రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. ఇలా అమాయక రైతులను బురిడీ కొట్టిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా ఆటను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు కట్టించారు.మహారాష్ట్రలోని అమరావతి కేంద్రంగా పనిచేస్తున్న ఈ ముఠా ఆదిలాబాద్ జిల్లాలోని ఫైనాన్స్ ట్రాక్టర్లను లక్ష్యంగా చేసుకుంది. ఇంద్రవెల్లి, బేలా, ఉట్నూర్, తాంసి మండలాల్లో రైతులను సంప్రదించి ట్రాక్టర్లను తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేల చొప్పున కమిషన్ ఆశ చూపిస్తూ స్థానిక ఏజెంట్లను కూడా తమ నెట్‌వర్క్‌లో చేర్చుకుంది.మొత్తం 9 ట్రాక్టర్లను అక్రమంగా తరలించినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రెండు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. మహారాష్ట్రలోని అమరావతి, చిక్లీ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.40 లక్షలుగా పోలీసులు అంచనా వేశారు.ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు యోగేష్ పాటిల్‌తో పాటు ఇంద్రవెల్లికి చెందిన ఇద్దరు స్థానిక ఏజెంట్లను అరెస్ట్ చేశారు. అయితే ఇంకా మూడు ట్రాక్టర్ల ఆచూకీ లభించాల్సి ఉంది. రైతుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని సాగిస్తున్న ఈ మోసాల వెనుక మరెవరైనా ఉన్నారా? మిగిలిన ట్రాక్టర్లు ఎక్కడున్నాయి? అన్న కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.ఫైనాన్స్ బకాయిలు చెల్లిస్తామంటూ వచ్చే అపరిచిత వ్యక్తులను నమ్మి ట్రాక్టర్లు అప్పగించవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ రైతులకు సూచిస్తున్నారు. మొత్తానికి లీజు పేరుతో సాగుతున్న ఈ ట్రాక్టర్ దందాపై పోలీసుల చర్యలు ఆదిలాబాద్ జిల్లా రైతుల్లో చర్చనీయాంశంగా మారాయి.

నిమిషాల్లో వైద్య, రక్షణ సేవలు



⏭ అమరావతిలో ట్రాఫిక్ రద్దీ లేని రహదారులు

టీ మీడియా, నవంబర్ 1, అమరావతి:
రాష్ట్ర భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. ఈ క్రమంలోనే నవ్యాంధ్ర రాజధానిలో రాబోయే వందేళ్ల వరకు ట్రాఫిక్ రద్దీ లేని విశాలమైన రహదారులను ప్రభుత్వం నిర్మిస్తోంది. అమరావతిలో 300 కిలోమీటర్ల మేర ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న గ్రిడ్ రహదారులు రాజధాని నగర ప్రగతికి సరికొత్త పునాదులు వేయబోతున్నాయి.

ట్రాఫిక్ రద్దీకి చెక్

అమరావతి మాస్టర్‌ప్లాన్ ప్రకారం రాజధాని ట్రంక్‌రోడ్లను గ్రిడ్ విధానంలో డిజైన్ చేశారు. ఇవి తూర్పు నుంచి పడమరకు ' ఇ ' అక్షరం, ఉత్తరం నుంచి దక్షిణానికి ' ఎన్ ' అక్షరం ఆకారంలో రెండు దిశల్లో ప్రధాన ప్రాంతాలను కలుపుతూ ప్రతి కిలోమీటరుకు ఒక రహదారిని నిర్మిస్తున్నారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్, నివాస ప్రాంతాలు, వాణిజ్య హబ్‌లు, ఐటీ కారిడార్లతో పాటు రాజధాని గ్రామాలను అనుసంధానిస్తూ సాగే ఈ రోడ్లతో భవిష్యత్తులో వాహనాల రద్దీ పెరిగినా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉండదు. రాజధానికి పర్యావరణహితమైన, మెరుగైన కనెక్టివిటీ ఏర్పడుతుందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.


5, 10 నిమిషాల్లో

రాజధాని రవాణా ప్రణాళికలో సమయపాలనకు పెద్దపీట వేశారు. నగరంలో ఏ మూల నుంచైనా 5 నిమిషాల్లో వైద్య, రక్షణ సేవలు, పది నిమిషాల్లో ఆహ్లాదకరమైన థీమ్ పార్కులు, వినోద కేంద్రాలకు చేరుకోవచ్చు. 15 నిమిషాల్లో నివాసాల నుంచి కార్యాలయాలకు చేరుకునేలా సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థను డిజైన్ చేశారు.

గ్రీన్ కారిడార్లు

అంతర్జాతీయ ప్రమాణాలతో సువిశాలమైన ఆరు వరుసల రహదారులను ప్రభుత్వం నిర్మిస్తోంది. కాలుష్య రహిత ప్రయాణాల కోసం సైకిల్, వాకింగ్ ట్రాక్‌లను నిర్మిస్తున్నారు. రహదారులకు రెండు వైపులా ఆహ్లాదకరంగా ఉండేందుకు మొక్కల పెంపకం, అందమైన స్ట్రీట్ ఫర్నిచర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. స్మార్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా ఆధునిక సివరేజ్ నెట్‌వర్క్, నీటి పునర్వినియోగానికి ప్రత్యేక లైన్లు, అత్యాధునిక వీధిదీపాలను ఏర్పాటు చేయనున్నారు. అమరావతిని కాంక్రీట్ వనంలా కాకుండా వందేళ్ల పాటు ట్రాఫిక్ కష్టాలు లేని పచ్చని స్మార్ట్‌సిటీగా మార్చడంలో ట్రంక్ రోడ్లు కీలకపాత్ర పోషించనున్నాయి.

కాంగ్రెస్ అభ్యర్థికి ఫ్యాన్ గుర్తు..



⏭ టీడీపీ అభ్యర్థికి వైసీపీ గుర్తు

టీ మీడియా, నవంబర్ 1 , అమరావతి బ్యూరో:
ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో రెండు చోట్ల గుర్తుల తారుమారు గందరగోళం సృష్టించింది. విజయవాడ 55వ డివిజన్‌లో కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గుర్తులు బ్యాలెట్ పేపర్‌పై మారడంతో పోలింగ్ నిలిపివేసి కొత్త బ్యాలెట్లతో తిరిగి ప్రారంభించారు. వెంకటగిరి 35వ వార్డులో టీడీపీ అభ్యర్థి పేరు ఎదురుగా వైఎస్సార్‌సీపీ గుర్తు ముద్రించడంతో అధికారులు సరిచేశారు.కాంగ్రెస్ అభ్యర్థికి ఫ్యాన్ గుర్తు.. డిస్‌ప్లే పేపర్‌లో టీడీపీ అభ్యర్థికి వైసీపీ గుర్తు .. మున్సిపల్ ఎన్నికల్లో గుర్తుల తారుమారు..మున్సిపల్ ఎన్నికల్లో రెండు చోట్ల అభ్యర్థుల గుర్తుల తారుమారు తీవ్ర గందరగోళానికి దారితీసింది. బ్యాలెట్ పేపర్లు, డిస్‌ప్లే బోర్డులపై గుర్తులు తారుమారవడంతో అభ్యర్థులు, ఓటర్లు ఆందోళనకు గురయ్యారు. అభ్యర్థుల ఫిర్యాదుతో అధికారులు వెంటనే కొత్త బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేస్తున్నారు

విజయవాడ 55వ డివిజన్‌లో

విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని 55వ డివిజన్‌లో బ్యాలెట్ పేపర్ ముద్రణలో పొరపాటు జరగడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.బ్యాలెట్ పేపర్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి వైఎస్సార్‌సీపీ (కొ=జూ) గుర్తును, అలాగే వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి కాంగ్రెస్ గుర్తును ముద్రించారు. అభ్యర్థులు ఫిర్యాదు చేయడంతో అధికారులు తప్పును గుర్తించి వెంటనే పోలింగ్‌ను నిలిపివేశారు. ఆ తర్వాత కొత్త బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేసి సుమారు గంటసేపు ఆలస్యంగా పోలింగ్‌ను పునఃప్రారంభించారు. పోలింగ్‌కు ఎంత సేపు అయితే బ్రేక్ పడిందో.. అంత సమయం సాయంత్రం అదనంగా కేటాయిస్తామని అధికారులు వెల్లడించారు. అయితే అధికారుల తీరుపై వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కేవలం ముద్రణ సమయంలో దొర్లిన చిన్న పొరపాటుపై అనవసరంగా రాజకీయం చేయవద్దని టీడీపీ నేతలు హితవు పలికారు.

డిస్‌ప్లే పేపర్ తారుమారు:

ఇదే తరహాలో తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపాలిటీలోనూ పొరపాటు వెలుగు చూసింది.వెంకటగిరిలోని 35వ వార్డు పోలింగ్ బూత్ వెలుపల ఏర్పాటు చేసిన డిస్‌ప్లే పేపర్‌లో తెలుగుదేశం పార్టీ (ఐ) అభ్యర్థి పేరు ఎదురుగా వైఎస్సార్‌సీపీ గుర్తును ముద్రించారు. పోలింగ్ ప్రారంభానికి ముందే అప్రమత్తమైన అధికారులు ఈ తప్పును గుర్తించి వెంటనే సరిచేశారు. ప్రస్తుతం అక్కడ ఎలాంటి అంతరాయం లేకుండా పోలింగ్ ప్రశాంతంగా సాగుతోంది. ఎన్నికల నిర్వహణలో ఇలాంటి ముద్రణా లోపాలు పునరావృతం కాకుండా అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్నికల సంఘం సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది.

ఇల్లందును కరువు మండలంగా ప్రకటించాలి



⏭మిషన్ భగీరథ లీకేజీ బాధితులకు పరిహారం ఇవ్వాలి: సీపీఎం

టీ మీడియా, నవంబర్ 1 ,ఇల్లెందు:
వర్షాధార పంటలపై ఆధారపడిన ఇల్లందు మండలాన్ని ప్రభుత్వం వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఇల్లందు పట్టణంలో మిషన్ భగీరథప్రధాన పైప్‌లైన్‌కు తరచూ లీకేజీలు ఏర్పడి ప్రజలు, వ్యాపారులు నష్టపోతున్నారని, బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరింది.
సీపీఎం ఇల్లందు మండల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం ఏలూరి లక్ష్మీనారాయణ భవన్‌లో మన్యం మోహన్‌రావు అధ్యక్షతన జరిగింది. పార్టీ జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. సాగునీటి సౌకర్యంతో మూడు పంటలు పండే కొన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, పూర్తిగా వర్షాధార పంటలపై ఆధారపడిన గిరిజన ప్రాంతమైన ఇల్లందును విస్మరించడం సరికాదన్నారుఇటీవల స్టేట్‌బ్యాంక్ ప్రధాన శాఖ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై వరద నీరు ప్రవహించడంతో బ్యాంకుతోపాటు పరిసర వ్యాపారులు నష్టపోయారని తెలిపారు. పట్టణంలోని జనావాసాలు, వాణిజ్య ప్రాంతాల గుండా ప్రధాన పైప్‌లైన్ వేయడం అశాస్త్రీయమని పేర్కొన్నారు. పైప్‌లైన్‌ను జనావాసాల నుంచి తొలగించి పట్టణం బయట నుంచి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో భారీగా నకిలీ నోట్లు పట్టివేత

⏭ నిందితుడు అరెస్ట్?

టీ మీడియా, నవంబర్,1 సికింద్రాబాద్:
రైల్వే స్టేషన్?లో భారీగా నకిలీ నోట్లు పట్టుబడిన ఘటన కలకలం రేపింది. నిందితుడు ముంబయి ఎల్?టీటీ ఎక్స్?ప్రెస్? జనరల్ కోచ్?లో జైపూర్ నుంచి ముంబయి నగరానికి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రాజస్థాన్‌లోని బికనీర్ ప్రాంతానికి చెందిన శివరతన్ మహియా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి రూ.60 లక్షల విలువైన నకిలీ కరెన్సీ నోట్లను వారు స్వాధీనం చేసుకున్నారు.

ప్రధాన నిందితుడి కోసం గాలింపు

ఈ కేసులో మరో నిందితుడు ఓ ప్రకాశ్? నకిలీ కరెన్సీ నోట్ల బ్యాగ్?ను అక్టోబర్ 28న జైపూర్ రైల్వే స్టేషన్?లో శివరతన్?కు ఇచ్చి, ముంబయిలోని ఓ వ్యక్తికి అందజేయాలని సూచించాడు. నకిలీ నోట్లు తరలించినందుకు రూ.2.20 లక్షలు ఇస్తానని వారు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందం మేరకు మైసూర్? ఎక్స్?ప్రెస్?లో కాచిగూడ చేరుకున్న నిందితుడు అక్టోబర్ 31న ముంబయి ఎల్?టీటీ ఎక్స్?ప్రెస్?లో ప్రయాణం చేస్తుండగా రైల్వే పోలీసులు పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు ఓం ప్రకాశ్? పరారీలో ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. గతంలో అతడిపై రాజస్థాన్?లో క్రిమినల్? కేసులు ఉన్నట్లుగా ప్రాథమికంగా గుర్తించారు. పరారీలో ఉన్న నిందితుడు కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు.



పంటలకు నీరిచ్చి ఆదుకోవాలి



టీ మీడియా, నవంబర్ 1 ,పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ మండల అధ్యక్షులు క్రాంతి నాయుడు ఆధ్వర్యంలో ణ19 ణ21ణ29 మొదటి చివరి ఆయకట్టు చెలిమిళ్ళ పాతపల్లి అయ్యవారిపల్లి గుమ్మడం గుమ్మడం తండా చిన్న గుమ్మడం యాపర్ల పెంచికలపాడు జనుపల్లి గ్రామాల రైతుల పొలాల్లో వేసిన వరి వేరుసెనగ మినుములు పత్తి మిరప ఎండిపోతున్నాయి జూరాలలో నీళ్లు ఉన్న వారబంది పద్ధతిలో విడవవలసిన నీళ్లను కూడా వదలకుండా నిర్లక్ష్యం వహిస్తూ కనీసం కాల్వ మొదటి వరుసలో ఉండే రైతులకు పంటలు కూడా ఎండిపోతున్నాయి ఆయకట్టు మొదటి చివరి వరుసలో ఉండే పంటలను ఎండకుండా చూడాల్సిన ప్రభుత్వం అధికారులు నిర్లక్ష్యం వల్ల అన్ని పంటలు ఎండిపోతున్నాయి పంటలు పరిశీలించిన భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కంచ ఆంజనేయులు పట్టణ బిజెపి అధ్యక్షులు క్రాంతి కుమార్ ఓబిసి మోర్చా రాష్ట్ర నాయకులు రామకృష్ణ బీజేవైఎం జిల్లా నాయకులు చింతకాయల శివ పట్టణ ప్రధాన కార్యదర్శి సర్వేశ్వర్ గౌడ్ అరవింద్ ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు ప్రసాద్ బాబు రైతుల పంటలను పరిశీలించి వారి ఆవేదనను తెలుసుకోవడం జరిగింది వెంటనే నీటిని విడుదల చేయాలని లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం అని ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది చివరి ఆయకట్టు రైతులకు నష్ట పరిహారం అందించాలని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎల్ నినో ప్రభావంపై ప్రత్యేక గ్రామ సభలు



● **రైతులకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన**

టీ మీడియా, నవంబర్ 1 , తల్లాడ :
ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని ముద్దునూరు, కలకోడిమ గ్రామ పంచాయతీలలో ఎల్ నినో వాతావరణ పరిస్థితులపై ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. వాతావరణంలో వచ్చే మార్పులు, వ్యవసాయ రంగంపై దాని ప్రభావం గురించి రైతులకు అవగాహన కల్పించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశం.ముద్దునూరు గ్రామంలో జరిగిన గ్రామ సభకు గౌరవ సర్పంచ్ శ్రీ యరమల రామ్ మోహన్ రెడ్డి అధ్యక్షత వహించారు. అలాగే కలకోడిమ గ్రామంలో జరిగిన సభకు గౌరవ ఉప సర్పంచ్ శ్రీ మనుబోలు సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ రెండు గ్రామ సభలకు ముఖ్య అతిథులుగా తల్లాడ ఎంపీడీఓ శ్రీ శ్రీధర్ రాజు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీ తాజుద్దీన్ ఏపీఓ శ్రీ కోటయ్య , ఏఈఓ , పంచాయతీ కార్యదర్శి శ్రీ ప్రశాంత్ గారు పాల్గొన్నారు. వారు రైతులకు ఎల్ నినో అంటే ఏమిటి, దాని వల్ల వాతావరణంలో ఎలాంటి మార్పులు వస్తాయి, వర్షపాతంపై దాని ప్రభావం ఎలా ఉంటుంది అనే విషయాలపై వివరంగా తెలియజేశారు.అగ్రికల్చర్ ఆఫీసర్ తాజుద్దీన్ మాట్లాడుతూ, ఎల్ నినో సమయంలో రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. తక్కువ నీటితో పండే పంటలు వేసుకోవడం, వర్షపు నీటిని ఒడిసి పట్టే విధానాలు, పంటల బీమా ప్రాముఖ్యత గురించి రైతులకు సూచనలు చేశారు. రైతులు భయపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.ఎంపీడీఓ శ్రీధర్ రాజు మాట్లాడుతూ, ప్రభుత్వం నుండి వచ్చే వాతావరణ హెచ్చరికలను రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని, గ్రామ పంచాయతీ ద్వారా ఇచ్చే సూచనలు పాటించాలని కోరారు. వ్యవసాయంలో నష్టం జరగకుండా ఉండేందుకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.ఈ గ్రామ సభల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. రైతులు తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ అవగాహన సదస్సులు రైతులకు ఎంతో ఉపయోగపడ్డాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బయటకు డెయిరీ ఫామ్.. లోపల మత్తు దందా



● **1.150 కిలోల గంజాయిస్వాధీనం**

టీ మీడియా, నవంబర్ 1 , పటాన్‌చెరు:
డెయిరీ ఫామ్‌ను అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును ఈగల్ ఫోర్స్, పటాన్‌చెరు పోలీసులు రట్టు చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామంలోని గోవిందరావు డెయిరీ ఫామ్‌పై సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులతో పాటు కొనుగోలు చేసేందుకు వచ్చిన నలుగురు వినియోగదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1.150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.57 వేలుగా అంచనా వేశారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సంచిత్ రాయ్ (50) సుమారు పదేళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. తొలుత గుమ్మడిదలలోని ఓ డెయిరీ ఫామ్‌లో మూడేళ్లపాటు పనిచేశాడు. అనంతరం గత మూడేళ్లుగా కర్దనూర్‌లోని గోవిందరావు డెయిరీ ఫామ్‌లో నెలకు రూ.20 వేల జీతంతో పనిచేస్తున్నాడు. మరో నిందితుడు మహేష్ కుమార్ (32) రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి గోవిందరావు డెయిరీ ఫామ్‌కు ఎదురుగా ఉన్న దేవి పార్కింగ్ యార్డులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గత ఏడాది కాలంగా సన్చిత్ రాయ్‌తో కలిసి గంజాయి విక్రయాలకు సహకరిస్తున్నాడు.

డెయిరీ ఫామ్‌ను అడ్డాగా చేసుకుని దందా

గోవిందరావు గతంలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవాడు. ఉద్యోగం కోల్పోయిన అనంతరం ఆర్థిక సహాయం తీసుకుని డెయిరీ ఫామ్‌ను ఏర్పాటు చేశాడు. పశువుల సంరక్షణ, ఫామ్‌కు సంబంధించిన పనుల కోసం సంచిత్ రాయ్ సహా పలువురిని నియమించుకున్నాడు. అయితే ఫామ్ యజమాని ఉదయం కొన్ని గంటలు మాత్రమే అక్కడికి వచ్చి వెళ్లడాన్ని ఆసరాగా చేసుకున్న నిందితులు, డెయిరీ ఫామ్ పరిసరాలను గంజాయి విక్రయాలకు ఉపయోగించుకోవడం ప్రారంభించారు.

ధూల్‌పేట్ నుంచి గంజాయి సరఫరా

సంచిత్ రాయ్‌కు బీహార్‌లో ఉన్నప్పటి నుంచే గంజాయి వినియోగించే అలవాటు ఉంది. గుమ్మడిదలలో పనిచేస్తున్న సమయంలో హైదరాబాద్‌లోని ధూల్‌పేట్‌కు చెందిన కిషన్ సింగ్‌తో పరిచయం ఏర్పడింది. అతని వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేయడం ప్రారంభించాడు. కర్దనూర్‌కు మారిన తర్వాత కూడా కిషన్ సింగ్ నుంచే గంజాయి తెప్పించుకునేవాడు. చుట్టుపక్కల ప్రాంతాల్లో పనిచేస్తున్న బీహార్, అస్సాం, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయాలు సాగించాడు. కిలో గంజాయిని రూ.20 వేల చొప్పున కొనుగోలు చేసి, ఐదు గ్రాముల చొప్పున చిన్న ప్యాకెట్లుగా తయారు చేసేవాడు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.300కు విక్రయించేవాడు. ఈ విక్రయాల్లో మహేష్ కుమార్ సహకరించేవాడు.

రోజుకు 20 నుంచి 30 మంది కస్టమర్లు

ప్రారంభంలో చిన్న స్థాయిలో, పార్ట్‌టైమ్‌గా ప్రారంభించిన ఈ గంజాయి వ్యాపారం క్రమంగా విస్తరించింది. గత ఏడాది కాలంగా సంచిత్ రాయ్ స్థానికంగా గంజాయి వినియోగదారులకు పరిచయమయ్యాడు. రోజుకు సగటున 20 నుంచి 30 మంది వరకు అతని వద్దకు వస్తుండగా, ఆదివారాల్లో ఈ సంఖ్య 50 నుంచి 60 వరకు ఉంటున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వినియోగదారులు మొబైల్ ఫోన్ ద్వారా నిందితులను సంప్రదించేవారు. అనంతరం డెయిరీ ఫామ్‌కు కొంత దూరంలోని ప్రదేశానికి రావాలని సూచించి, రోడ్డు పక్కన గంజాయి ప్యాకెట్లను అందజేసి నగదు రూపంలో డబ్బులు వసూలు చేసేవారు. వారానికి రెండు మూడు సార్లు కిషన్ సింగ్ నుంచి ఒకటి నుంచి రెండు కిలోల చొప్పున గంజాయి తెప్పించుకునేవారు.

నవోదయ హాల్ టికెట్లు సిద్ధం

టీ మీడియా, నవంబర్ 1, కూసుమంచి:
2027 బి 2028 విద్యా విధానం సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయములో 6 వ తరగతి ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు హాల్ టికెట్లు సిద్ధంగా ఉన్నాయని పాలేరు జవహర్ నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కావున విద్యార్థులు, తల్లిదండ్రులు నవోదయ విద్యాలయ సమితి అధికారిక వెబ్ సైట్ ను సందర్శించి, రిజిస్ట్రేషన్ నెంబరు, పుట్టిన తేదీ వివరములను నమోదు చేసి హాల్ టికెట్ పొందవచ్చని నవోదయ ప్రిన్సిపల్ తెలియజేశారు.

రోడ్డు విస్తరణలో భాగంగా నూతన స్థంబాలు వైర్లు



టీ మీడియా, నవంబర్ 1 ,పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని పెబ్బేరు వనపర్తి రోడ్డు విస్తరణలో బాగంగా ఆదివారం విద్యుత్ శాఖా అధికారులు కొత్త స్తంభాలను అమర్చినూతన వైర్లను లాగుతున్న విద్యుత్ అధికారులు ఇప్పటికే వున్న పాత స్తంభాలను తీసివేసి కొత్త స్తంభాలకు కనెక్షన్ తో విద్యుత్ సరఫరా మెరుగవుతుందనీ రోడ్డు విస్తరణలో ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వస్త్రాధారణ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



టీ మీడియా, నవంబర్ 1, నారాయణఖేడ్:
నారాయణాఖేడ్ నియోజకవర్గం మనూర్ మండలం బోరంచ గ్రామం ఆప్తుడు మల్ల నర్సింహా రెడ్డి సోదరుడి కుమారుడు,కుమార్తె నూతన వస్త్రాధారణ వేడుక వారి స్వగృహం బోరశీచ లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోల సుధాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బోజిరెడ్డి వారితో సర్పంచ్ బీరప్ప , పోచమ్మ మందిరం చేర్మెన్ మల్లన్న కౌన్సిలర్ బాణపురం రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవకులకు సన్మానం



టీ మీడియా, నవంబర్ 1 ,పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ అధ్యక్షులు రాజ్ దేశ్ పాండే చేతుల మీదుగా వడ్డె ఈశ్వర్ గురుస్వామి కర్నాటి శ్రీనివాస్ గౌడ్ గురుస్వామికి సన్మానం గత 25 సంవత్సరాలకు పైగా అయ్యప్ప స్వామి సేవలో తమ జీవితాలను అంకితం చేస్తూ భక్తి నిష్ట క్రమశిక్షణతో ధర్మ ప్రచారానికి విశేష కృషి చేస్తున్న గురుస్వాములకు ఆత్మీయ సన్మానం కార్యక్రమం ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం మక్తల్ పట్టణ నందు అనిల్ గురుస్వామి అశోక్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ అధ్యక్షులు రాజ్ దేశ్ పాండే గురుస్వామి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సీమ నరేందర్ గురుస్వామి రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్డే ఈశ్వర్ గురుస్వామి రాష్ట్ర అన్నదాన కమిటీ కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్ గౌడ్ గురుస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు వీరితోపాటు ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం పెబ్బేరు తరఫున పున్న శ్రీనివాస్ గురుస్వామి మధు గురుస్వామి గొడుగు శాంతన్న గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాటు బాంబుల పేలుడు..



● **చిన్నారులతో సహా ఆరుగురికి తీవ్రగాయాలు..!**

టీ మీడియా, నవంబర్ 1 ,కామారెడ్డి :
బాన్సువాడ పట్టణంలోని వడ్డెర బస్తీలో నాటు బాంబులు పేలిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బైక్‌పై నాటు బాంబులను తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తూ పేలుడు సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడగా, వారిలో నలుగురు చిన్నారులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది.పేలుడు ధాటికి గాయపడిన వారంతా ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న స్థానికులు క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. చిన్నారులు కూడా గాయపడటంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. నాటు బాంబులను బైక్‌పై ఎందుకు తీసుకెళ్తున్నారు? వాటిని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? పేలుడుకు అసలు కారణం ఏమిటి? అనే కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పేలుడుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. బాన్సువాడ వడ్డెర బస్తీలో చోటుచేసుకున్న ఈ పేలుడు స్థానికంగా తీవ్ర భయాందోళనకు గురిచేసింది. పోలీసుల దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.